మహిళా ఓటర్లే అధికం

- జిల్లాలో మొత్తం ఓటర్లు 5,14,705
- మహిళలు 2,66,756.. పురుషులు 2,47,940
- ఈ నెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న తుది ఓటరు జాబితా వెల్లడి

మెదక్, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. మొత్తం 5,14,705 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 2,66,756 మంది, పురుషులు 2,47,940 మంది ఉన్నారు. ఇతరులు 9 మంది ఉన్నారు. పంచాయతీ ఓటర్ల జాబితా ముసాయిదాను శుక్రవారం ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ విడుదల చేసిన విషయం తెలిసిందే. పంచాయతీ కార్యాలయాల్లో వార్డుల వారీగా, మండల పరిషత్ కార్యాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. జిల్లాలో 469 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇటీవల 22 పంచాయతీలు కొత్తగా ఏర్పాటుచేశారు. దీంతో జిల్లాలో మొత్తం గ్రామ పంచాయతీలు 491కి పెరిగాయి. ఇందులో 4210 వార్డులు ఉన్నాయి.

రామాయంపేట మండలంలోని కోనాపూర్ గ్రామ పంచాయతీ వద్ద ఓటరు సవరణ ప్రకటన

ఈ నెల 29న తుది ఓటరు జాబితా

ఓటరు జాబితాపై ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. 26 వరకు వాటిని పరిష్కరించి 28న తుది జాబితా ప్రకటించనున్నారు. ఈ నెల 18న ఓటర్ల జాబితాపై జిల్లా ఎన్నికల అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవోలు సమావేశమవుతారు.

రామాయంపేటలో..

రామాయంపేట, సెప్టెంబర్ 14: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల వద్ద ఓటరు జాబితా సవరణ ముసాయిదా ప్రకటనను విడుదల చేసింది. శనివారం మండలంలోని పీ.ధర్మారం, కాట్రియాల, లక్ష్మాపూర్, సుతారిపల్లి, కోనాపూర్ తదితర గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు జాబితా అందజేశారు. ముసాయిదా ప్రకటనను పంచాయతీల వద్ద ప్రజలు చూసుకోవడానికి అంటించారు. ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు సవరణకు అవకాశం ఉంటుందని తెలిపారు.

21 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఓటర్లు జాబితాలను పరిశీలించి ఏమైనా సందేహాలుంటే ఈనెల 21వ తేదీ వరకు అభ్యంతరాలు తెలుపవచ్చు. వాటిని ఈ నెల 26వ తేదీ వరకు పరిష్కరిస్తాం. 28న తుది జాబితా ప్రకటిస్తాం. ఇంకా ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోని వారుంటే బీఎల్‌వోలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదులో మార్పులు, చేర్పులు సైతం చేసుకోవచ్చు.

-యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

పిట్ల సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, సెప్టెంబర్ 14: బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి దవాఖానకు వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు చెప్పారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, రైతు సమన్వయ సమితి మాజీ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ ఎం పీటీసీ ఇందిరా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కన్నారం దుర్గేశ్, శ్రీకాంత్‌రెడ్డి, నలంద రవి ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శ్రావణి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 14: టేక్మాల్ మండలం కమ్మరికత్త మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలిగా తాళ్లపల్లి శ్రావణి ఎంపికైంది. అందోల్ మండలం సంగుపేట శివారులో ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పంపిణీలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారాన్ని శ్రావణికి అందజేసి సత్కరించారు.

చిట్కుల్‌లో రూ.1,06,550 విరాళం అందజేత

చిలిపిచెడ్, సెప్టెంబర్ 14: వినాయక ఉత్సవాల్లో భాగంగా చిట్కుల్, బద్రియ తండాలోని 12 వినాయక విగ్రహాలకు కలిపి రూ.1,06,550 విరాళాన్ని కాంగ్రెస్ నాయకుడు తార విష్ణువర్ధన్‌రెడ్డి శనివారం అందజేశారు. ఆయనతో నాయకులు వెంకట్ రెడ్డి, రాములు, అఖిల్, భాగయ్య, వెంకటాచలం, కూన్య, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

నిందితులపై కేసు నమోదు చేయాలి

రామాయంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట సుతార్‌పల్లి గ్రామస్తుల నిరసన

రామాయంపేట, సెప్టెంబర్ 14: వ్యక్తి ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్‌కు చెందిన నిందుతులను వెంటనే అరెస్టు చేయాలని రామాయంపేట పోలీస్‌స్టేషన్‌లో సుతార్‌పల్లి గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న గ్రామస్తులు సీఐ వెంకటరాజగౌడ్, ఎస్సై బాలరాజుతో మాట్లాడారు. మృతుడు పున్న స్వామి ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితుల పై కేసులు నమోదు చేయాలని మృతుడి భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వ దవాఖాన మార్చురీలో భద్రపరిచిన మృతుడు స్వామి మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు.

మైనర్లకు వాహనాలిస్తే కేసులు

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

అల్లాదుర్గం, సెప్టెంబర్ 14: మైనర్లకు వాహనాలిస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి అ న్నారు. శనివారం ఐబీ చౌరస్తా వద్ద రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ పత్రా లు కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్‌కు మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్డు నిబంధనలు పాటి స్తూ వాహనాలు నడిపితే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మండల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, హైవే సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలు ముగింపు

శివ్వంపేట, సెప్టెంబర్ 14 : ఈ నెల 12, 13 తేదీలలో గోమారం గ్రామ ఉన్నతపాఠశాల ఆవరణలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో అండర్-17 విభాగం పురుషులలో వాలీబాల్‌లో శివ్వంపేట, కబడ్డీలో శివ్వంపేట, కోకోలో శివ్వంపేట మొదటిస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో వాలీబాల్‌లో గోమారం, కబడ్డీలో శివ్వంపేట, కోకోలో కేజీబీవీ శివ్వంపేట మొదటిస్థానంలో నిలిచాయి. అండర్-14 విభాగంలో పురుషులలో కబడ్డీలో శివ్వంపేట, వాలీబాల్‌లో రత్నాపూర్, కోకో లో గోమారం పాఠశాలలు మొదటిస్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో కబడ్డీలో కేజీబీవీ శివ్వంపేట, వాలీబాల్‌లో గోమారం, కోకో లో పిల్లుట్ల పాఠశాలలు మొదటిస్థానంలో నిలిచాయి. గెలుపొందిన టీములకు ఫ్లెమింగ్ ల్యాబోరేటరీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఎంఈవో బుచ్యానాయక్, పీఈటీలు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలుచేయాలి



రామాయంపేటకు పాదయాత్రగా చేరుకున్న ఎస్సీ రిజర్వేషన్ క్రిమిలేయర్ కమిటీ

రామాయంపేట, సెప్టెంబర్ 14: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ అమలుచేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ అన్నారు. శనివారం రామాయంపేటకు చేరుకున్న పాదయాత్రలో మెదక్ రోడ్డు వద్ద ఆయన మాట్లాడారు. పాదయాత్ర ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు 40 రోజుల పాటు జరుగుతుందన్నారు. దీంతో రాష్ట్రంలో ఎంతోమంది దళితులకు న్యాయం జరుగుతుందన్నారు.

ప్రైవేట్ పాఠశాలపై దాడి

నర్సాపూర్‌లోని సెయింట్ డాన్‌బాస్కో హైస్కూల్‌ను పరిశీలిస్తున్న ఎస్సై లింగం

నర్సాపూర్, సెప్టెంబర్ 14: నర్సాపూర్‌లోని సెయింట్ డాన్‌బాస్కో ప్రైవేట్ పాఠశాలలో కొందరు చొరబడి పాఠశాల సిబ్బందిపై దాడి చేసిన ఘటన నర్సాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌లోని సంగారెడ్డి మార్గంలో గల సెయింట్ డాన్‌బాస్కో హైస్కూల్‌లోకి నర్సాపూర్‌కు చెందిన కొందరు వ్యక్తులు అక్రమంగా చొరబడి కిటికి అద్దాలు, వాటర్ బాటిళ్లు, టీచర్ల సెల్‌ఫోన్లను ధ్వంసం చేశారని వెల్లడించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

లేజర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు

- సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు తక్కువ డెసిబుల్స్ మాత్రమే వాడాలి
- జిల్లాలో 2975 వినాయక విగ్రహాల ప్రతిష్ఠపాన
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్‌లో సీఐ, ఎస్సైలతో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 14: వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. నిమజ్జన సమయంలో తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నవరాత్రి వేడుకల్లో డీజేలు వాడవద్దన్నారు. లేజర్ షో ఏర్పాటు చేస్తున్నారని, ఆ కిరణాలు పడి కళ్లు పోయే ప్రమాదం ఉన్నదని, లేజర్ షో, లేజర్ లైటింగ్‌కి అనుమతి లేదని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 2975 వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించారన్నారు.

నర్సాపూర్ పీఎస్‌ను సందర్శించిన ఎస్పీ

నర్సాపూర్, సెప్టెంబర్ 14: నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్ శనివారం సందర్శించారు. సర్కిల్ పరిధిలోని నర్సాపూర్, కౌడిపల్లి, చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్ల క్రైమ్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లోని అబుండ్సెడ్ వెహికల్స్ ఓనర్లను గుర్తించి వాళ్లకు వెహికల్స్ అప్పగించాలని ఎస్సైలను ఆదేశించారు. క్రైమ్ మీటింగ్‌లో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సైలు లింగం, రంజిత్‌కుమార్, మిస్బావుద్దీన్ పాల్గొన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్, సెప్టెంబర్ 14: మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక మండప నిర్వాహకులు నిమజ్జనం రోజు డీజే, లేజర్ లైట్లు వాడొద్దని ఎస్సై పోచయ్య తెలిపారు.

పక్కాగా రెక్కీ చేసి బైకుల దొంగతనం

- 17బైకులు, ఒక స్కూటీ స్వాధీనం
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పోలీసుల అదుపులో ఉన్న నిందుతుడు జర్పుల మోహన్, స్వాధీనం చేసుకున్న బైకులు

శివ్వంపేట, సెప్టెంబర్ 14: జనం కండ్లు గప్పి ఇండ్ల వద్ద, రోడ్డు పక్కన పార్కు చేసిన బైకులను పక్కాగా రెక్కీ నిర్వహించి, చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం చోరీలకు సంబంధించిన పూర్తి వివరాలను శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. మండలంలోని రూప్లాతండా పంచాయతీకి చెందిన జరుపుల మోహన్ జల్సాలకు అలవాటు పడి ఏడాదిగా ఇండ్ల ముందున్న, రోడ్డు పక్కన నిలిపిన బైకులను పక్కా రెక్కీ నిర్వహించి చోరీ చేస్తున్నాడు. తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవాడు. దొంగలించిన బైకులను నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎర్ల నరేశ్‌కు తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు చెప్పాడు. దీంతో నరేశ్‌ను కూడా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. 17 బైకులు, ఒక స్కూటీ మొత్తం 18 ద్విచక్రవాహనాలు, రూ.20 వేల నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ వాహనాల విలువ రూ.6 లక్షల 10 వేలు ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. కేసు ఛేదనలో కృషి చేసిన డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, సీసీఎస్ తిరుమలేశ్, శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి, సీసీఎస్ సిబ్బంది ప్రశాంత్, దత్తు, రాము, చిట్టిబాబు, కానిస్టేబుళ్లు గోపాల్, మహేందర్, జాన్, రాజును అభినందించి, రివార్డులు అందజేశారు.

ఈజీ మనీతో మోసపోవద్దు

ఈజీ మనీ వస్తుందని సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శివ్వంపేట మండలంలో ఈజీ మనీ వస్తుందని సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయిన వారిని గుర్తుచేశారు. చదువుకుని, అన్నీ తెలిసిన వారే ఎక్కువగా మోసపోతున్నారని, ప్రతిఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండలంలో గంజాయి నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎక్కడైనా గంజాయి గురించి సమాచారం తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. గంజాయి అమ్మినా, వాడినా వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చాకరిమెట్లలో భక్తుల పూజలు



శివ్వంపేట, సెప్టెంబర్ 14: మండలంలోని చిన్నగొట్టిముక్ల పంచాయతీలో గల చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, చందనాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు.

రేవంత్‌రెడ్డికి చంద్రబాబు గతే పడుతుంది

జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ



సమావేశంలో మాట్లాడుతున్న కల్లూరి సంజీవ

నర్సాపూర్,సెప్టెంబర్ 14: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలుకు తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ హెచ్చరించారు. లేకపోతే తెలంగాణలో చంద్రబాబుకు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందన్నారు. శనివారం నర్సాపూర్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ అమలుకు ఎస్సీల అభిప్రాయాన్ని సేకరించకుండా కమిటీ వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. కమిటీని తాము అంగీకరిచమని కుండలుబద్దలు కొట్టారు. మాదిగల జనాభా కంటే మాల, మాల ఉపకులాల జనాభా ఎక్కువగా ఉన్నదని గుర్తుచేశారు. సమావేశంలో మండల అధ్యక్షుడు గోవు యాదగిరి, కార్యవర్గ సభ్యులు దాడిగా రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణపై డీఎస్పీ విచారణ

మనోహరాబాద్, సెప్టెంబర్ 14: మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి శనివారం విచారణ చేపట్టారు. తమను కుల బహిష్కరణ చేశారంటూ గ్రామానికి చెందిన పంచమి చంద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై సుభాష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి

శివ్వంపేట, సెప్టెంబర్ 14: కుటుంబ కలహాలతో మహిళ మృతిచెందిన ఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బుడిగెజయమ్మ (50) తన ఇంట్లో కుటుంబ కలహాలతో పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని మృతిచెందింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లిలో గణేశుడికి పూజలు చేస్తున్న మహిళలు

సీఎం సహాయ నిధితో పేదలకు అండ

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 14: గజగట్లపల్లికి చెందిన పురుషోత్తం, అంజయ్య, శ్రీనివాస్ అనారోగ్యంతో దవాఖానలో చికిత్స చేయించుకున్నారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ వారికి సీఎం సహాయనిధి నుంచి రూ.73,500ల చెక్కులను శనివారం వారికి మధుసూదన్, శేఖర్‌తో కలిసి అందజేశారు.

వరి పొలాల్లో అడవి పందుల విధ్వంసం

అడవి పందులు ధ్వంసం చేసిన వరిపైరు

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 14: అడవి పందులు పంట పొలాలపై దాడి చేస్తున్నాయని, దీంతో కంటిపై కునుకు లేకుండా పోతున్నదని మల్లుపల్లి రైతులు వాపోతున్నారు. వర్షాలు దండిగా కరవడంతో గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేశాడు. పంట పొట్టకు వచ్చిన సమయంలో వరిని అడవి పందులు పూర్తిగా ధ్వంసం చేశాయి. దీంతో భారీగా పంట నష్టం జరిగిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆటో నంబర్లతో నేరాలకు చెక్

చిట్కుల్‌లో ఆటో నంబర్లు రాయించిన ఏఎస్సై మిస్బాద్దీన్, సిబ్బంది

చిలిపిచెడ్, సెప్టెంబర్ 14: ఆటోల్లో తిరుగుతూ దొంగతనాలు, సైబర్ నేరాలకు పాల్పడకుండా మండలంలోని ప్రతి ఆటోకు నంబర్లు వేస్తున్నట్లు ఏఎస్సై మిస్బాద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని చిట్కుల్, ఫైజాబాద్, చండూర్ ఆయా గ్రామాలకు చెం దిన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ఆటోలకు వెనుక, ముందు సీరియల్ నంబర్, మండల, జిల్లా కోడ్‌లను ఏఎస్సై రాయించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆటోల వివరాలు సేకరించి, ఇరువైపులా నంబర్లు వేయడంతో ఆటో గురించి పూర్తిగా తెలుస్తుందని అన్నారు. దీంతో ఆటోలో తిరిగి దొంగతనాలు, సైబర్ నేరాలు చేసే వారిని పట్టుకోవచ్చన్నారు. ఆటో డ్రైవర్లు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దుర్గాప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీలత

పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 14: పెద్ద శంకరంపేట మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా శ్రీలత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన విఠల్ నాయక్ జిన్నారం మోడల్ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆదర్శ పాఠశాల హెచ్ఎం బదిలీ

చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 14: చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాల హెచ్ఎం శ్రీదేవి శనివారం జిన్నారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ నుంచి వాణి కుమారి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

నర్సాపూర్, సెప్టెంబర్14: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే వారికి 2024-25 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని టీచర్ సామ్యానాయక్ తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అపరాధ రుసుంతో అడ్మిషన్లు పొందవచ్చిని సూచించారు. పదో తరగతి అడ్మిషన్‌కు టీసీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, రెండు ఫొటోలు, కులం సర్టిఫికెట్ జిరాక్సులు, ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్‌కు పదో తరగతి మెమో, కులం సర్టిఫికెట్, ఆధార్, రెండు ఫొటోలు అందజేయాలని సూచించారు.

కారు, ఆటో ఢీకొని వ్యక్తి మృతి



ప్రభాకర్ (ఫైల్)

మెదక్‌రూరల్, సెప్టెంబర్ 14: కారు, ఆటో ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మచవరం శివారులో శనివారం జరిగింది. రూరల్ ఎస్సై మురళి, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్చారం మండలం అంసాన్‌పల్లికి చెందిన తుమ్మలపల్లి ప్రభాకర్ (45) వ్యవసాయం చేసుకుంటూ, ఆటో నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మెదక్ నుంచి అంసాన్‌పల్లి వస్తుండగా నర్సాపూర్ నుంచి మెదక్ వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పడి ఒకరు మృతి

శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబర్ 14: గణేశ్ నిమజ్జనానికని ట్రాక్టర్‌ను కడగడానికి వెళ్లిన యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆవంచ గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆవంచ గ్రామానికి చెందిన గంట శ్రీనివాస్ (26) గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయకుడి నిమజ్జనానికని ట్రాక్టర్‌ను కడగడానికి స్థానిక పెద్ద చెరువు వద్దకు స్నేహితులతో కలిసి వెళ్లాడు. ట్రాక్టర్‌ను కడిగిన తర్వాత చెరువు నుంచి బయటికొచ్చాక తనకు బురద అంటిందని, స్నానం చేస్తానని చెరువులోకి దిగాడు. ఇంతలో ఈత రాకపోవడంతో మట్టి కోసం చెరువులో తీసిన గుంతలో పడి, నీటిలో మునిగి మృతిచెందాడు. స్నేహితులు, గ్రామస్తులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. తల్లి భూమమ్మతో కలిసి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొడుకు మృతితో ఆ తల్లి రోదనలు గ్రామస్తులను కంటతడి పెట్టించాయి.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES
★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT-332617

BUSINESS OFFER
★SSS GRAPHICS Wanted District Wise Franchisees & also Distributors for 2025 Diaries and Calendars. Cont: 8639471849, 8790523529, Hyderabad.
NT-331739

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకు